

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

***దీక్షా కంకణుడు***



మనిషి ముందుకు సాగుతున్న కొద్దీ తనదైన బాణీని, సరళినీ వెదుక్కుంటాడు. వెనక్కి తిరిగి చూస్తే కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఆయన వ్యక్తిత్వం ఆయన కళలో కనిపిస్తుంది. కానీ ఎత్తుగడనుంచీ ఓ సుడిగాలిలా, అతి స్పష్టమయిన భావనతో, వ్యక్తిత్వంతో దాదాపు మూడుతరాల సినీ ప్రేక్షకులను రంజింప చేసిన కళామూర్తి కోవెలమూడి సూర్యప్రకాశరావుగారు.

మొన్నటి తరానికీ, నిన్నటి తరానికీ, నేటి తరానికీ ఆయన అనూహ్యమయిన వారథి. దర్శకత్వం చేపట్టిన తొలిరోజుల్లోనే మొట్టమొదటిసారిగా ‘బాలానందం‘ పిల్లలని తెరమీదకి ఎక్కించి అలనాడు నా చిన్నతనంలో నాలాంటి ఎందరో పిల్లల్ని తన్మయుల్ని చేశారాయన. ఈనాడు ఆలోచిస్తే అది సాహసం. కానీ ప్రకాశరావుగారు ప్రజాభిప్రాయాన్ని ముఖ్యంగా పసిమనసుల్ని కాచి వడబోసిన కళాకారులు.

మరికాస్త ముందుకి సాగి ఎన్నిసార్లు తీసినా ఇదే ప్రామాణికమనిపించేలా, హృదయం ద్రవించేలాగా, ఆనాటి యువతరానికి కలల్లో కదిలేలాగా "రాముని బుద్ధిమంతనం"ను ‘దీక్ష‘గా తెరకెక్కించారు. ఎంత గొప్ప చిత్రం అది. శరత్‌బాబు అంత హృద్యంగా ఓ పెరిగే క్షురవాని మనస్సుని ఎంత రమ్యంగా తెరమీద ఆవిష్కరించారు ప్రకాశరావుగారు. ఆ సినిమాలో సాహితీ రంగానికీ, సినిమా రంగానికీ మరో మహోపకారం చేశారు ప్రకాశరావుగారు. ఆచార్య ఆత్రేయచేత మొదటి ‘పాట‘ వ్రాయించారు. ఆ తర్వాత ఆత్రేయ తెలుగు పాటకి ప్రాణం పోసిన విషయం ప్రజానీకానికి తెలుసు.

ఎంత క్లిష్టమయిన ఇతివృత్తాన్నయినా తన కథనంతో క్షీరసాగర మధనం చేయగలమనకున్న తక్కువ, గొప్ప స్క్రీన్‌ప్లే రచయితలలో ప్రకాశరావుగారు ఒకరు. ఆయన "తాసిల్దారుగారి అమ్మాయి" స్క్రీన్‌ప్లే నాకు చదివి వినిపించినప్పుడు ఇన్ని ఫ్లాష్ బ్యాక్‌లతో ఈ కథ ఎలా నెగ్గుకు వస్తారా అని అనుమానపడ్డాను. కానీ తీరా చిత్రం చూశాక కథా గమనంలో ఇతివృత్త ఆవిష్కరణలో తెలుగు సినిమాని ఓ మలుపు తిప్పారు ప్రకాశరావుగారు. నా అహంకారాన్ని మరిచి నా జీవితంలో ఒకేసారి ఫాన్ ఉత్తరం రాశాను. కావిలిపాటి విజయలక్ష్మిగారికి.

తర్వాత 'ప్రేమనగర్', దర్శకుడికి భాష ప్రమేయం లేదనీ, ఏ ప్రాంతానికయినా, ఏనాటికయినా కళ విశ్వజనీనమనీ నిరూపించిన ఘనత ప్రకాశరావుగారికి దక్కింది. ఆత్రేయ, ప్రకాశరావుగారి జోడుగుర్రాల స్వారీ ఆ చిత్రం. అన్నిటా పరిపుష్టిని సాధించిన కళాఖండం.

మద్రాసులో నా నివాసానికిగాను ప్రకాశరావుగారు ఇల్లు చూశారు. నేను నిద్రలేస్తే ప్రతి ఉదయం ఎదురింటి వాకిట్లో స్క్రీన్ ప్లే వ్రాసుకుంటూ ప్రకాశరావుగారు కనిపించేవారు. ఆయన నాకు స్ఫూర్తి. సిగ్గుపడి దిగ్గున లేచేవాడిని. ఆయన దర్శకత్వంలో ఒక చిత్రం వ్రాశాను. సెట్ మీదకి రాకుండానే ఆయనంత నిర్దుష్టంగా చిత్రాన్ని కళ్ళకి కట్టేటట్టు దిద్దుకునే దర్శకులు అరుదు. ఆ మాట నాతో ఓసారి అక్కినేనిగారు అన్నారు.

అభిరుచినీ, అభినివేశాన్నీ, సాహిత్యాన్నీ, చిత్ర నిర్మాణాన్ని అంత సమపాళ్ళల్లో రంగరించకపోతే 'ఎవరికోసం' వంటి పాట పుట్టదు. పుట్టినా ఆ రూపం దిద్దుకోదు.

ప్రకాశరావుగారితో కలిసి ఓ సినిమాలో (సంకెళ్ళు) నటించే అవకాశం నాకు దక్కింది. అంజలీదేవిగారు నాకు అక్క. ప్రకాశరావుగారు బావగారు. ఓ గొప్ప దర్శకుడు మరో దర్శకుని చేతిలో నటుడు కాగా చూడడం కొత్త. అయితే తెరవెనుక నటించడం ప్రకాశరావుగారికి కొత్తకాదు. అప్పటికే 45 ఏళ్ళ పాతది.

ఆయన చాలా స్క్రీన్‌ప్లేలు నాకు చదివి వినిపించారు. స్క్రీన్‌ప్లే స్థాయిలోనే ఉన్నతమయిన చిత్రాన్ని చూపించగల గొప్ప రచయిత ఆయనలో అజ్ఞాతంగా ఉన్నారు. ఈ మధ్య ఉగాది సందర్భంలో ఆలిండియా రేడియో కార్యక్రమంలో ఒక 'సాహితీ ప్రశ్నావళి' కార్యక్రమం నిర్వహించాను. అది ప్రసారం అవుతూనే ఫోన్ మోగింది. ప్రకాశరావుగారు ఫోన్‌లో అభినందించారు. 'చాలా అనుభవంతో, సమర్ధవంతంగా నిర్వహించారు' అని. అది నాకెంతో గొప్ప కితాబు. నిజానికి నాకు వచ్చిన ఒకే ఒక్క ఫోన్ కాల్ అదే.

సినిమా రంగానికి ప్రకాశరావుగారు ఇచ్చిన మరో గొప్ప వరం రాఘవేంద్రరావు. వినోదాన్నీ, అభిరుచినీ మేళవించి ఘంటాపథంగా విజయాన్ని ఇవ్వడాన్ని 'అలవాటు' చేసుకున్న తండ్రిని మించిన తనయుడు, మిత్రుడు రాఘవేంద్రరావు. ఎప్పుడు మేం కలిసినా ప్రకాశరావుగారితో కలిసి కూర్చుని, ఆయనతో మాట్లాడడానికి ముందుకి నన్ను నడుపుతారు రాఘవేంద్రరావు.

ప్రభుత్వంతో, దక్షతతో ధైర్యంగా చెప్పి, చెప్పింది తీసి చూపించగల సత్తా, ధీమాగల ఆ తరం ఆఖరి యోధుడు ప్రకాశరావుగారు. రఘుపతి వెంకయ్య అవార్డుని ఆలస్యంగా ఇచ్చి ఆంధ్రప్రభుత్వం ఓ గొప్ప అవకాశాన్ని కోల్పోయింది. ఈ సంవత్సరం రఘుపతి వెంకయ్య సత్కారం ఆయన చేతలదాకా ప్రయాణం చెయ్యని కొరత ఆ సత్కారానిదే.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments